సాక్షి
వనపర్తి
మంగళవారం | 9 | సెప్టెంబర్ | 2025



తెరుచుకున్న ఆలయాలు
చంద్ర గ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం మూసిన ఆలయాలను అర్చకులు సోమవారం తెరిచి పూజలు నిర్వహించారు. -8లో ▸



జూరాలకు తగ్గిన వరద
జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద సోమవారం తగ్గడంతో పీజేపీ అధికారులు క్రస్టు గేట్లను మూసివేశారు. -8లో ▸

గరిష్టం/కనిష్టం
37.5 /21.5
వాతావరణం
వర్షం తగ్గుముఖం పట్టింది. మధ్యాహ్నం వేళ ఎండ తీవ్రత కాస్త కనిపిస్తుంది. ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది.

న్యూస్‌రీల్

రామన్‌పాడులో తగ్గిన నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో సోమవారం సముద్రమట్టానికి పైన 1,020 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ కాల్వ నుంచి 920 క్యూసెక్కులు, సమాంతర కాల్వ నుంచి 288 క్యూసెక్కుల నీరు జలాశయానికి చేరుతుండగా.. ఎన్టీఆర్ కాల్వకు 875 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 55 క్యూసెక్కులు, వివిధ ఎత్తిపోతల పథకాలకు 872 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కులు వినియోగించినట్లు వివరించారు.

పనిభారం తగ్గించాలంటూ ఏఎన్‌ఎంల ఆందోళన



వనపర్తి రూరల్: తమపై పనిభారం తగ్గించాలంటూ ఏఐటీయూసీ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లాలోని ఏఎన్‌ఎంలు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, కార్యదర్శి మోషా మాట్లాడుతూ.. కేంద్ర ఆరోగ్యశాఖ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎన్సీడీ కార్యక్రమ ఆన్‌లైన్ నమోదు పనులను ఏఎన్‌ఎంలకు అప్పగించడం సరికాదన్నారు. వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఏఎన్‌ఎంలు అధిక పనిభారంతో సతమతమవుతున్నారని.. 14 రకాల మొబైల్ యాప్‌లలో అనేక రకాలైన స్క్రీనింగ్ టెస్టులు చేసి ప్రభుత్వానికి నివేదిస్తున్నారని చెప్పారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గోపాలకృష్ణ, శ్రీరామ్, ఏఎన్‌ఎంలు కృష్ణవేణి, లక్ష్మి, సుమిత్ర, లత, బాలీశ్వరమ్మ, వెంకటమ్మ, మాధవి, రాధిక, లలిత, అనురాధ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు హర్షణీయం : బీజేపీ



వనపర్తి రూరల్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పేదల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని జీఎస్టీని తగ్గించిందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గొని వేమారెడ్డి తెలిపారు. సోమవారం పెబ్బేరు సుభాష్ చౌరస్తాలో పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు ఆయనతో పాటు స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ మెంటేపల్లి పురుషోత్తంరెడ్డి, పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, పెద్ది రాజు, ఉపాధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, కిసాన్‌మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి వెంకట్రామారెడ్డి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు క్రాంతినాయుడు, మండల అధ్యక్షుడు నాగరాజు యాదవ్, నర్సింహనాయుడు, రామకృష్ణ, మోతె రాఘవేంద్ర, శ్రీకాంత్, రాజేష్‌గౌడ్, గోనెల అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

నగదు కేంద్రాలుగా.. రేషన్ దుకాణాలు

సన్నబియ్యం కిలో రూ.16కు కొనుగోలు చేస్తున్న డీలర్లు

- లబ్ధిదారు వేలిముద్ర వేయించుకొని నగదు చెల్లిస్తున్న వైనం
- అవే బియ్యం మిల్లులకు తరలింపు
- మెజార్టీ దుకాణాల్లో ఇదే తంతు..



వనపర్తి: ఏళ్లుగా రీసైక్లింగ్‌కు అలవాటుపడిన మిల్లర్లు ఏటా కొత్తదారులు వెదుక్కుంటున్నారు. గతంలో ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని ఇల్లిల్లూ తిరిగి రేషన్ బియ్యం సేకరించి మిల్లులకు తరలించి ప్రభుత్వ గన్నీబ్యాగుల్లో నింపి సీఎంఆర్ పేరున తిరిగి అప్పగించేవారు. టాస్క్‌ఫోర్స్, పోలీసులు, పౌరసరఫరాలశాఖ అధికారుల పర్యవేక్షణ పెరగడంతో తమ పంథా మార్చుకున్నారు. గుట్టుగా రీసైక్లింగ్ దందా కొనసాగించేందుకు మిల్లర్లు లబ్ధిదారులను వదిలేసి అక్రమార్జనకు అలవాటుపడిన కొందరు రేషన్ డీలర్లను ఎంచుకున్నారు. వీరు లబ్ధిదారుల వద్ద వేలిముద్ర వేయించుకొని కిలో బియ్యం రూ.16కు కొనుగోలు చేసి నేరుగా దుకాణం నుంచి మిల్లులకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. కొంతకాలంగా ఈ దందా గుట్టుగా సాగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇటీవల మూడునెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ చేసిన సమయంలో పెద్దమొత్తంలో రేషన్ బియ్యం దుకాణల ద్వారా మిల్లులకు చేరినట్లు తెలుస్తోంది. తాజాగా వారం నుంచి జిల్లాలో బియ్యం పంపిణీ ప్రారంభమైన విషయం విధితమే. దొడ్డు బియ్యం సరఫరా చేసినప్పుడు కిలో రూ.9 ప్రకారం లబ్ధిదారుల నుంచి డీలర్లు కొనుగోలు చేసి మిల్లర్లకు విక్రయించేవారు. ప్రస్తుతం సన్న బియ్యం సరఫరా ప్రారంభమైనప్పటి నుంచి కిలో రూ.16 లెక్కన లబ్ధిదారు నుంచి కొని రూ.ఒకటి, రూ.రెండు అదనపు రేటుతో మిల్లర్లకు డీలర్లు విక్రయించి రీసైక్లింగ్‌కు సహకరిస్తున్నట్లు తెలుస్తోంది.

జిల్లాలో 5.23 లక్షల మంది లబ్ధిదారులు..

జిల్లాలోని 268 గ్రామపంచాయతీలు, ఐదు పురపాలికల పరిధిలో 324 రేషన్ దుకాణాలుండగా.. సుమారు 5.23 లక్షల మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున ప్రతి నెలా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు. ఇందులో పట్టణ ప్రాంతాల్లోని రేషన్ దుకాణాల నుంచి పెద్ద మొత్తంలో బియ్యం రీసైక్లింగ్ అవుతున్నట్లు తెలుస్తోంది. సన్నబియ్యం పంపిణీ తర్వాత వినియోగం స్వల్పంగా పెరిగినా.. రీసైక్లింగ్ మాత్రం ఆగటం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఎఫ్‌సీఐ అంటే జంకు..

జిల్లాలో సీఎంఆర్ కేటాయింపులు పొందిన మిల్లర్లలో కొందరు ఎఫ్‌సీఐకి అందించేందుకు జంకుతున్నారు. ఇందుకు కారణం ఎఫ్‌సీఐ గోదాం వద్ద ఉంటే టీఏలు నిబంధనలు పక్కాగా పాటిస్తారని.. ఏ మాత్రం తేడా ఉన్నా తిప్పి పంపుతారు. ఒక్క లారీ తిప్పిపంపితే రూ.వేలల్లో నష్టం వస్తోంది. దీంతో ఎక్కువగా సీఎస్‌సీ (రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో ఉండే పౌరసరఫరాలశాఖ)కు బియ్యం ఇవ్వడానికి మొగ్గుచూపుతారు.

పర్యవేక్షణ పెంచుతాం..



రేషన్ బియ్యం రీసైక్లింగ్ పై పర్యవేక్షణ పెంచుతాం. రేషన్ దుకాణాల్లో వేలిముద్ర వేయించుకొని బియ్యానికి బదులు డబ్బులు ఇచ్చినట్లు నిర్ధారణ అయితే చర్యలు కఠినంగా ఉంటాయి. ప్రభుత్వం ఎంతో ఖర్చుతో ఉదారంగా ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తుంటే విక్రయించడం సరికాదు. లబ్ధిదారులు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యాన్ని వినియోగించుకోవాలిగాని డబ్బులకు విక్రయించవద్దు.
– భీమ్యానాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్

చక్రం తిప్పుతున్న టీఏలు..

రేషన్ డీలర్లు, లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసిన బియ్యం సీఎంఆర్‌గా సీఎస్‌సీ (సివిల్ సప్లయ్ కార్పొరేషన్)కి అప్పగించే సమయంలో మిల్లర్లు చేసే మాయాజాలాన్ని గుర్తించడం సాంకేతిక సహాయకుల(టీఏ)కు సులభం. కానీ వారిచ్చే కానుకలకు తలొగ్గి అనుమతిస్తుండటంతో మిల్లర్ల రీసైక్లింగ్ దందా యథేచ్ఛగా సాగుతోందని చెప్పవచ్చు.

పోలీసులపై ప్రజలకు పెరిగిన విశ్వసనీయత



పెట్రోల్‌బంక్ ప్రారంభోత్సవంలో ఐజీ రమేష్‌రెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్, ఇతర అధికారులు

పెట్రోల్‌బంక్ ప్రారంభోత్సవంలో ఐజీ రమేష్‌రెడ్డి

వనపర్తి: పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్‌బంక్‌లో నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటిస్తామని రాష్ట్ర పోలీస్ హౌజింగ్‌బోర్డు మేనేజింగ్ డైరెక్టర్, ఐజీ రమేష్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని రాజపేట శివారులో వనపర్తి పోలీస్‌శాఖ సౌజన్యంతో ఏర్పాటు చేసిన పెట్రోల్‌బంక్‌ను కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, ఎస్పీ రావుల గిరిధర్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు పోలీసు వ్యవస్థపై విశ్వసనీయత పెరిగిందన్నారు. జిల్లాలో పోలీస్ విభాగం ద్వారా పెట్రోల్‌బంకు ఏర్పాటుకు ప్రతిపాదిస్తే కలెక్టర్, ఎమ్మెల్యే వేగంగా స్పందించి తక్కువ కాలంలో అనుమతులు ఇవ్వడంతో 4 నెలల వ్యవధిలో పూర్తి చేసినట్లు వివరించారు. భవిష్యత్‌లో బైపాస్ రోడ్, మదనాపురం రైల్వేస్టేషన్ నుంచి జిల్లాకేంద్రానికి నాలుగు లైన్ల రహదారి నిర్మిస్తే వాణిజ్యపరంగా అభివృద్ధి చెందుతుందని, తద్వారా నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందని వివరించారు. పెట్రోల్‌బంక్ నిర్వహణలో పారదర్శకత, నాణ్యత ప్రమాణాలు పాటించి ప్రజల ఆదరణ మరింత పొందుతామని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇండియా జస్టిస్ రిపోర్ట్‌లో దేశంలోనే తెలంగాణ పోలీసులు ప్రథమ స్థానంలో ఉండటం గర్వకారణమన్నారు.

వనపర్తి–కొత్తకోట కారిడార్‌కు ప్రతిపాదనలు..

వనపర్తి – కొత్తకోట కారిడార్ ఏర్పాటుకు ప్రతిపాదనలను ఆర్‌అండ్‌బీ మంత్రికి అందజేసినట్లు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. దీంతోపాటు వనపర్తికి ఒక బైపాస్ రోడ్డు పెబ్బేరును అనుసంధానిస్తూ ప్రతిపాదించామని.. అది కూడా మంజూరైందని త్వరలోనే పనులు చేపడతామన్నారు. అనంతరం కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ.. ఎస్పీ రావుల గిరిధర్ ప్రత్యేక చొరవతోనే తక్కువ కాలంలోనే పెట్రోల్‌బంక్ ఏర్పాటు చేశారని ఈ సందర్భంగా ఎస్పీతో పాటు సిబ్బందిని అభినందించారు. మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసే పెట్రోల్ బంకులను త్వరగా పూర్తిచేయాలని ఐఓసీఎల్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఐఓసీఎల్ అధికారులు సుమిత్ర, శరణ్య, డీఎస్పీ వెంకటేశ్వరరావు, జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, వివిధ పోలీస్‌స్టేషన్ల సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

బాధ్యతతో మెలిగితే ఉత్తమ సమాజం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయమూర్తి వి.రజని

వనపర్తిటౌన్: నేరానికి శిక్ష తప్పదనే నిజాన్ని గ్రహించి బాధ్యతతో మెలగాలని.. అప్పుడే సమాజంలో నేరాలు తగ్గి ఉత్తమ సమాజం రూపుదిద్దుకుంటుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి వి.రజని అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని సీవీ రామన్ టాలెంట్ స్కూల్‌లో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. చట్టాలపై అవగాహన కలిగి ఉంటే సమాజం తెలుస్తుందని, ఏ తప్పునకు ఏ శిక్ష పడుతుందో తెలుసుకుంటే ఎవరూ ఎలాంటి తప్పిదాలు చేసేందుకు ధైర్యం చేయరన్నారు. అలాగే బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, మోటారు వాహనాల చట్టం, ఉచిత నిర్బంధ విద్య, పోక్సో యాక్ట్ గురించి వివరించారు. డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కృష్ణయ్య, కరస్పాండెంట్ డా. మురళీధర్, మేనేజింగ్ డైరెక్టర్ నవీన్, స్కూల్ అడ్వైజర్ సత్తార్, ప్రిన్సిపాల్ షబానా పాల్గొన్నారు.

అడవుల్లో అసైన్డ్ స్థలాలను గుర్తించాలి



ప్రత్యేక విచారణ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: జిల్లాలోని అటవీ భూమిలో ప్రభుత్వం ద్వారా ఏమైనా అసైన్డ్ చేసి ఉంటే గుర్తించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ప్రత్యేక విచారణ కమిటీతో సమావేశమై మాట్లాడారు. అటవీ భూమిలో ఎలాంటి నిర్మాణాలుగాని, ఇతరులకు అప్పగించడానికి వీలు లేదన్నారు. ఎక్కడైనా పొరపాటున అసైన్డ్ చేసి ఉంటే ఆ భూమిని సర్వేనంబరుతో గుర్తించడానికి కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కమిటీలో అటవీశాఖ అధికారి, ఆర్డీఓ, ఏడీ సర్వే ల్యాండ్ రికార్డ్స్, సంబంధిత తహసీల్దార్ ఉంటారన్నారు. జిల్లా అటవీ అధికారి ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో అటవీ భూమి కొన్నచోట్ల తక్కువ, మరికొన్ని చోట్ల ఎక్కువ చూపిస్తున్నారని, సర్వే చేసి ఉండాల్సిన భూమి గుర్తించి ఇవ్వాల్సిందిగా కోరారు. సమావేశంలో ఆర్డీఓ సుబ్రమణ్యం, ఏడీ సర్వే ల్యాండ్ రికార్డ్స్ బాలకృష్ణ, ఆర్‌అండ్‌బీ డి, ఈ సెక్షన్ సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించాలి..

ప్రజావాణి ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణిలో ఇన్‌చార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యంతో కలిసి పాల్గొని ఫిర్యాదుదారులతో అర్జీలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. అర్జీదారులకు తగిన సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మధ్యాహ్నం భోజన విరామ సమయం వరకు 44 వినతులు వచ్చినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు. అన్నిశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలీసు ప్రజావాణికి 5 వినతులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఎస్పీ రావుల గిరిధర్ పాల్గొని ఫిర్యాదుదారుల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకొని తక్షణమే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమం ముగిసే సమయం వరకు మొత్తం 5 వినతులు వచ్చినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు.

తప్పులు లేని ఓటరు జాబితా రూపొందిద్దాం



మాట్లాడుతున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ యాదయ్య

వనపర్తి: త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించేందుకు సహకరించాలని ఇన్‌చార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ యాదయ్య కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల జిల్లాస్థాయి ప్రతినిధులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు 6వ తేదీన ముసాయిదా ఓటరు జాబితా రూపొందించి అన్ని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచామన్నారు. 8వ తేదీ వరకు అభ్యంతరాలు, సూచనల స్వీకరణకు అవకాశం కల్పించామని.. ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలు, లొకేషన్‌లలో అభ్యంతరాలుంటే తెలుపాలని సూచించారు. 9వ తేదీన ఫిర్యాదులు పరిష్కరించి 10వ తేదీన తుది ఓటరు జాబితా ప్రకటిస్తామని వివరించారు. ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో 3,82,295 మంది ఓటర్లుండగా.. అందులో పురుషులు 1,90,068 మంది, మహిళలు 1,92,223 మంది, ఇతరులు నలుగురు ఉన్నట్లు వివరించారు. జిల్లాలో 133 మంది ఎంపీటీసీలు, 15 మంది జెడ్పీటీసీలను ఎన్నుకుంటారని.. ఇందుకోసం 268 గ్రామపంచాయతీలు, 2,436 వార్డులు, 283 లొకేషన్లలో 657 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో రెండు విడతలుగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతిపాదనలు పంపించామని మొదటి విడతలో వనపర్తి నియోజకవర్గంలోని 8 మండలాలు, రెండో విడతలో మిగిలిన 7 మండలాల్లో ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ఆర్డీఓ సుబ్రమణ్యం మాట్లాడుతూ.. ముసాయిదా ఓటరు జాబితాలో 1,370 మందికి రెండుచోట్ల ఓటు హక్కు, 800 వరకు మృతిచెందిన వారి పేర్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఎన్నికల్లోపు వారి పేర్లు తొలగించి ఓటరు జాబితా ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. తమకు ముందుగానే ఓటరు జాబితా ఇవ్వాలని, సమావేశం మినిట్స్ కాపీని అందజేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరారు. సమావేశంలో జెడ్పీ సూపరింటెండెంట్ నాగేశ్వర్‌రెడ్డి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ రామమహేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ నుంచి గట్టు యాదవ్, బీజేపీ నుంచి డి.నారాయణ, సీపీఐ (ఎం) నుంచి ఎండీ జబ్బార్, ఎంఐఎం నుంచి ఎండీ రహీం పాల్గొన్నారు.

అన్నదాతల ఆగ్రహం

యూరియా ఇవ్వాలంటూ ఖిల్లాఘనపురంలో రాస్తారోకో చేసిన రైతులు



ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న అన్నదాతలు

ఖిల్లాఘనపురం: యూరియా దొరక్కపోవడంతో అన్నదాతల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. సోమవారం మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయం వద్ద మూడురోజుల కిందట యూరియా పంపిణీ చేశారు. సోమవారం కార్యాలయం వద్ద ఎదురుచూసిన రైతులకు యూరియా రాదని తెలియడంతో నేరుగా వనపర్తి–మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళనకు దిగారు. యూరియా ఇచ్చేదాక కదిలేది లేదని.. యూరియా కావాలంటూ నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న మండల వ్యవసాయ అధికారి మల్లయ్య, తహసీల్దార్ సుగుణ అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. రోజుల తరబడి తిరుగుతున్నా రెండు బస్తాల యూరియా ఇవ్వడం లేదని.. బడా నాయకులను వందల సంచులు ఎలా వెళ్తుందని అధికారులను నిలదీశారు. మండలానికి ఎంత వచ్చిందో చెప్పాలని, వెంటనే తీసుకొచ్చి పంపిణీ చేయాలని పట్టుబట్టారు. సాయంత్రం వరకు యూరియా తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటామని, దయచేసి సహకరించాలని ఏఓ కోరారు. అప్పటి వరకు రైతువేదిక దగ్గర టోకన్లు పంపిణీ చేస్తామన్నారు. దీంతో రైతులు ఆందోళన విరమించి రైతువేదిక దగ్గరకు వెళ్లారు.

రైతుల పడిగాపులు..



పీఏసీఎస్ వద్ద రైతుల బారులు

ఆత్మకూర్: స్థానిక పీఏసీఎస్ వద్ద సోమవారం తెల్లవారుజాము నుంచే వివిధ గ్రామాల రైతులు యూరియా కోసం చెప్పులు, పట్టాదారు పాసు పుస్తకాలను వరుసలో పెట్టి పడిగాపులు పడ్డారు. మధ్యాహ్నం 300 సంచులు రాగా పోలీసులు కలుగజేసుకొని రైతులను వరుసలో నిల్చోబెట్టి 150 మందికి పంపిణీ చేశారు. మిగిలిన 213 మంది రైతులకు టోకెన్లు అందించామని మంగళవారం సరఫరా చేస్తామని ఏఓ వినయ్‌కుమార్, సీఈఓ నరేష్ తెలిపారు.

పాన్‌గల్‌లో అదే రద్దీ..



సింగిల్‌విండో ఎదుట రైతుల గుంపులు

పాన్‌గల్: మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయానికి సోమవారం 300 బస్తాల యూరియా వచ్చిందన్న విషయం తెలుసుకున్న వివిధ గ్రామాల రైతులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో కార్యాలయ ఆవరణ రైతులతో కిక్కిరిసిపోయింది. రెండ్రోజుల కిందట ఇచ్చిన టోకన్లు 816 ఉండగా వారికి పంపిణీ చేశారు. వారిలో ఇంకా 516 మంది మిగిలిపోగా.. కొత్తగా 400 వరకు టోకన్లు పంపిణీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

మదనాపురంలో ధర్నా..



విండో ఎరువుల దుకాణం ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు

మదనాపురం: మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎరువుల దుకాణం వద్ద సోమవారం రైతులతో కలిసి బీఆర్‌ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కృష్ణయ్య యాదవ్ మాట్లాడుతూ.. యూరియా కోసం ఒక్కో రైతు 15 రోజుల తరబడి దుకాణాల చుట్టూ తిప్పుకోవడం సరైంది కాదని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు సాకులు చెబుతూ రైతులను మభ్యపెట్టడం మంచి పద్ధతి కాదని, వెంటనే సరిపడా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ జేకే మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బిట్లు యాదగిరి, మాజీ మండల కో–ఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, మాజీ సర్పంచ్‌లు విజయేందర్‌రెడ్డి, అనిమోని మాసన్న యాదవ్, కురుమూర్తి, శివశంకర్, శ్రీనివాసులు, రాజ్‌కుమార్, ఆవుల బాలు, మాజీ మార్కెట్ డైరెక్టర్లు దేశి వెంకటేష్ యాదవ్, నక్క సత్యం పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన అవినీతి అధికారి



మద్దూరు: మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఓ రైతు నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ సీహెచ్ బాలకృష్ణ వివరాల మేరకు.. మద్దూరు మండలం రెనివట్ల రెవెన్యూ గ్రామ పరిధిలోని అప్పిరెడ్డిపల్లికి చెందిన ఓ రైతు తన 5 గుంటల భూమి డీఎస్ పెండింగ్ సమస్యను పరిష్కరించాలని ఆర్ఐ కె.అమర్‌నాథ్‌ను సంప్రదించగా.. రూ. 5వేల లంచం డిమాండ్ చేశాడు. దీంతో సదరు రైతు ఏసీబీని ఆశ్రయించడంతో పక్కా ప్రణాళిక ప్రకారం దాడులు నిర్వహించినట్లు డీఎస్పీ తెలిపారు. రైతు నుంచి ఆర్ఐ డబ్బులు తీసుకొని మహబూబ్‌నగర్‌కు కారులో వెళ్తుండగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట పట్టుకొని తనిఖీ చేశామన్నారు. రైతు నుంచి తీసుకున్న డబ్బులను రికవరీ చేసి ఆర్ఐని అదుపులోకి తీసుకున్నామన్నారు. మంగళవారం అతడిని ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

క్లుప్తంగా

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య


రాజు(ఫైల్)

పెంట్లవెల్లి: కుటుంబ కలహాలతో ఫ్యాన్‌కు ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెంట్లవెల్లి మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ ఖయాం తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రాజు (38)కు పదేళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలంగా కుటుంబంలో భార్యాభర్తల మధ్య కలహాలు చోటుచేసుకోవడంతో రెండు నెలల క్రితం భార్య పుట్టింటికి వెళ్లింది. మనస్థాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. రాజు తండ్రి శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

- విద్యుత్ కంచె తగిలి మృతి చెందాడని ఆరోపణ


జేమ్లానాయక్ (ఫైల్)

గండీడ్: విద్యుదాఘాతంతో వృద్ధుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలో సోమవారం జరిగింది. పూర్తి వివరాలు.. మండల పరిధిలోని పరుగుల తండాకు చెందిన జేమ్లానాయక్(65) సోమవారం ఉదయం పొలం దగ్గరకు వెళ్లాడు. మధ్యాహ్నం వరకు ఇంటికి రాకపోవడంతో భార్య రుక్కమ్మ పొలానికి వెళ్లి చూడగా కాలిన గాయాలతో గుడిసెలో విగతజీవిగా పడి ఉన్నాడు. పక్క పొలాల వారు అడవి పందుల కోసం వేసిన విద్యుత్ కంచె తగిలే జేమ్లానాయక్ మృతి చెందాడని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మృతి చెందిన అనంతరం తమ గుడిసెలో పడుకోబెట్టినట్లు పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ చేస్తూ..


ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

మల్దకల్: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని నాగర్‌దొడ్డి శివారులో చోటు చేసుకుంది. పూర్తి వివరాలు.. అయిజకు చెందిన ప్రవీణ్‌కుమార్‌గౌడ్ (24) నాగర్‌దొడ్డి శివారులో తన పొలంలో సోమవారం మధ్యాహ్నం నీరు పెట్టేందుకు వెళ్లి మోటారును ఆన్ చేశాడు. విద్యుత్ సరఫరా కాకపోవడంతో సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు కావడంతో మృతుడి తల్లిదండ్రులు శ్రీనివాస్‌గౌడ్, సుజాత కన్నీరు మున్నీరయ్యారు.

వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఎర్రవల్లి: జాతీయ రహదారిపై బొలెరో వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన కోదండాపురం పీఎస్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ మురళి కథం ప్రకారం.. మండలంలోని వేముల స్టేజీ సమీపంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి జాతీయ రహదారిని దాటుతున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి కర్నూలు వైపు వెళ్తున్న బొలెరో వాహన డ్రైవర్ మంజునాథ్ అతివేగంతో వ్యక్తిని ఢీకొట్టాడు. ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు హైవే అంబులెన్స్‌లో గద్వాల ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేవని, వయస్సు 30–35 మధ్య ఉంటుందని, పసుపు రంగు చొక్కా, బ్రౌన్ కలర్ ప్యాంటు ధరించాడు. మృతదేహం గద్వాల మార్చురీలో ఉందని ఆచూకీ తెలిసిన వారు కోదండాపురం పీఎస్ నంబర్ 8712670283ను సంప్రదించాలని ఎస్‌ఐ పేర్కొన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తెరుచుకున్న ఆలయాలు

- చంద్ర గ్రహణంతో ఆదివారం మధ్యాహ్నం మూసివేసిన అర్చకులు
- ఆలయ శుద్ధి, సంప్రోక్షణ తదితర ప్రత్యేక పూజల నిర్వహణ
- మహా మంగళహారతితో భక్తులకు దర్శనాలు



మన్యంకొండ దేవస్థానం ప్రధాన ముఖద్వారం తెరుస్తున్న అర్చకులు, అలంపూర్ జోగుళాంబ అమ్మవారి ఆలయంలో సంప్రోక్షణ

అలంపూర్: రాహుగ్రస్త చంద్రగహణంతో ఆదివారం మధ్యాహ్నం అలంపూర్ ఆలయాలను అర్చకులు మూసివేశారు. సోమవారం తెల్లవారుజామున ఆలయ అధికారులు, అర్చకులు మూసిన ఆలయాల ద్వారాలను తెరిచి గర్భాలయాల్లో సంప్రోక్షణ చేపట్టారు. ఆలయ సిబ్బంది మండపాల్లో శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి జోగుళాంబ అమ్మవారు, బాలబ్రహ్మేశ్వరస్వామి వారికి మహా మంగళహారతి ఇచ్చి ఆలయాల్లోకి భక్తులను అనుమతించారు. చంద్ర గ్రహణం ముగియడంతో ఆలయాల్లో పూజలు యధావిధిగా కొనసాగాయి. వివిధ ప్రాంతాల భక్తులు క్షేత్రానికి చేరుకొని అమ్మవారు, స్వామివారిని దర్శించుకున్నారు.

మన్యంకొండలో దర్శనాలు ప్రారంభం..

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో చంద్ర గ్రహణంతో ఆదివారం మధ్యాహ్నం నిలిచిన దర్శనాలను సోమవారం ఉదయం 9 గంటలకు ప్రారంభించారు. అలాగే కొండ దిగువన ఉన్న అలివేలు మంగతాయారు ఆలయంలోనూ దర్శనాలు ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామునే ఆలయ శుద్ధి, పుణ్యాహవాచనం, సంప్రోక్షణ తదితర ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఆయా పూజా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందాచారి, పాలక మండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

జూరాలకు తగ్గిన వరద


మూసివేసిన జూరాల క్రస్టుగేట్లు

ధరూరు/ఆత్మకూర్/శాంతినగర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద సోమవారం తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆదివారం ప్రాజెక్టుకు 1.20 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. సోమవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో 65వేల క్యూసెక్కులకు తగ్గింది. దీంతో తెరిచి ఉంచిన క్రస్టు గేట్లను మూసివేశారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 43,640 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 67, ఎడమ కాల్వకు 1,190, కుడి కాల్వకు 700.. ప్రాజెక్టు నుంచి మొత్తం 59,647 క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా 8.770 టీఎంసీలు ఉన్నట్లు తెలిపారు.

622 మి.యూ. విద్యుదుత్పత్తి..

జూరాల జల విద్యుదుత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తి వేగంగా కొనసాగుతుంది. సోమవారం ఎగువ 6 యూనిట్ల నుంచి 234 మెగావాట్లు, 298.473 మి.యూ, దిగువ 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 324.683 మి.యూ. విద్యుత్పత్తిని చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు.

ఆర్డీఎస్‌లో పెరిగిన నీటి ప్రవాహం

శాంతినగర్: వడ్డేపల్లి మండలం జూలెకల్ సమీపంలో ఆర్డీఎస్ కెనాల్‌లో నీటి ప్రవాహం పెరిగింది. మూడు రోజుల క్రితం కెనాల్‌లో నీటి ప్రవాహం రెండు అడుగులకు పడిపోయిన విషయం తెలిసిందే. ఆది, సోమవారం ఎగువ నుంచి నీరు రావడంతో ఆరడుగులకు నీటి ప్రవాహం పెరిగింది. దీంతో ఆర్డీఎస్ ప్రధాన కాల్వ నిండుకుండను తలపిస్తుంది. ఇటీవల వర్షాలు తగ్గుముఖం పట్టడంతో కెనాల్ పరివాహక ప్రాంతాల్లోని రైతులు వారి పంట పొలాలకు నీటి తడులు ఇస్తున్నారు.

ఒక గేటు ద్వారా నీటి విడుదల

దోమలపెంట: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద తగ్గుముఖం పట్టడంతో శ్రీశైలం ఆనకట్ట మూడు గేట్లలో రెండు గేట్లను అధికారులు మూసి వేశారు. ఒక గేటు పది అడుగుల మేర ఎత్తి స్పిల్‌వే ద్వారా 27,616 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 44,933, సుంకేసుల నుంచి 40,014 మొత్తం 84,947 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయం వస్తుంది. మరో వైపు భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315, ఏపీ.జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,890 మొత్తం 66,205 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 884.0 అడుగుల వద్ద 210.0320 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

ప్రజావాణి సమస్యల పరిష్కారం.. బూటకం


మాట్లాడుతున్న ఖలీల్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఎన్నో ఆశలు పెట్టుకొని కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి వచ్చే ప్రజల సమస్యలను అధికారులు పరిష్కరిస్తారనేది ఒట్టి బూటకమని టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్ మండిపడ్డారు. సోమవారం టీఎఫ్‌టీయూ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజావాణి సమస్యల పరిష్కారంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. డబుల్ బెడ్రూం సమస్యల పరిష్కారం కోసం ఎన్ని వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. అర్హులైన పేదలకు ఇళ్లు ఇవ్వాల్సిన మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయం అధికారులు నాన్చుడు ధోరణితో కాలయాపన చేస్తున్నారన్నారు. వందల సంఖ్యలో దరఖాస్తులు వచ్చినా పట్టింపులేదన్నారు. సర్వే నంబర్ 523లో ఇళ్ల పట్టాలు స్వాధీనం చేసిన వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అర్హులకు న్యాయం చేయని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో టీఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గట్టన్న, జలాల్‌పాషా, బోయవెంకటమ్మ, కుమ్మరి పద్మ, బషీరుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యాయత్నం


పురుగు మందు డబ్బాతో గజ్జల కృష్ణయ్య

మిడ్జిల్: తన తల్లి పేరిట ఉన్న సర్వేనంబర్‌లో తమకు మోఖా చూపించి అప్పగించాలంటూ మండలంలోని వాడ్యాలకు చెందిన రైతు గజ్జల కృష్ణయ్య సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో పురుగుమందు తాగి ఆత్మహత్య యత్నానికి యతి్నంచారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన జంగమ్మకు గ్రామంలోని సర్వేనంబర్ 156లో 3 గుంటల భూమి ఉంది. ఆ సర్వేనంబర్ జడ్చర్ల–కల్వకుర్తి ప్రధాన రహదారిని అనుసరించి ఉండటం.. ఆ నంబర్‌లో ఉన్న పట్టాదారులు మోఖా ఇవ్వకపోవడంతో పట్టాదారు పాసు పుస్తకంలో ఉన్న ప్రకారం భూమి హద్దులు నిర్ధారించి అప్పగించాలంటూ తల్లి జంగమ్మతో కలిసి కృష్ణయ్య కొన్ని రోజులుగా తహసీల్దార్ కార్యాలయానికి తిరుగుతున్నారు. సోమవారం మధ్యాహ్నం తహసీల్దార్ రాజు దగ్గరకు వచ్చి తమకు మోఖా చూపించాలని లేదంటే వెంట తెచ్చుకున్న పురుగుమందు తాగి చనిపోతానంటూ డబ్బా మూత తీస్తుండగా అక్కడే ఉన్న రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. అనంతరం తహసీల్దార్ ఎస్‌ఐకు ఫోన్‌చేసి సమస్య పరిష్కరించాలని సూచించారు. దీంతో వారు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

కొత్తకోట రూరల్: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గత నెల 29న కొత్తకోట మండలం అమడబాకుల స్టేజీ సమీపంలో దాబా దగ్గర టీ తాగేందుకు వినోద్ అతని ఫ్రెండ్స్ రాజు, సన్నీలు బైక్‌పై వెళ్తున్నారు. ఎదురుగా వస్తున్న మరో బైక్ వారిని ఢీకొట్టడంతో పట్టణానికి చెందిన వినోద్(21) తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరు స్నేహితులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు ముగ్గురిని 108లో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. తీవ్ర గాయాలైన వినోద్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు, అక్కడి నుంచి సికింద్రాబాద్‌లోని శ్రద్ధ రెహబిలేషన్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వినోద్ మృతి చెందాడు. అతని తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు.

‘రైల్వేగేట్ మూసివేతతో సంబంధం లేదు’


మాట్లాడుతున్న గోదాముల డైరెక్టర్ కృష్ణారెడ్డి

దేవరకద్ర రూరల్: కౌకుంట్ల రైల్వేస్టేషన్ పరిధిలో ఉన్న రైల్వేగేట్ మూసివేతకు తమకు ఎలాంటి సంబంధం లేదని శ్రీలక్ష్మి వేంకటేశ్వర రైల్వే గోదాముల మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం గోదాముల దగ్గర నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదాములు నిర్మించిన తర్వాతే రైల్వేగేట్ మూసివేశారని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. రైల్వేశాఖ భవిష్యత్ ప్రణాళికలో భాగంగా కాచిగూడ నుంచి కర్నూలు వరకు ఒకేరోజు అనేక రైల్వేగేట్లను మూసివేసిందని.. అందులో 81వ నంబర్ గేట్ కూడా ఉందని వివరించారు. రైల్వేగేట్‌ను తెరిపించాలని 2024, మార్చి 4న ఎమ్మెల్యేతో కలిసి తాము కూడా రైల్వే జీఎంను కలిసి వినతిపత్రం అందించామని చెప్పారు. అలాగే పుట్టపల్లి రోడ్డుపై గోదాములకు వచ్చే బియ్యం లారీలు తిరగడంతో దెబ్బతినలేదని.. వెంకంపల్లి సమీపంలో ఉన్న క్రషర్ వాహనాల రాకపోకలతోనే ఉండవచ్చని తెలిపారు. రోడ్డు తమ పరిధి సమస్య కానప్పటికీ గ్రామస్తుల ఇబ్బందులను గుర్తించి మరమ్మతుకు సహకరించామని తెలిపారు. స్థానికంగా గోదాములు ఉండటంతో అనేక మందికి ఉపాధి లభిస్తుందని.. కౌకుంట్ల అభివృద్ధికి ఇప్పటి వరకు రూ.10 లక్షలు అందజేశామని, ప్రభుత్వ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులను నియమించి వారి వేతనాలు చెల్లిస్తున్నామని వివరించారు. గ్రామాభివృద్ధికి తమవంతు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాములు, భాస్కర్, నితిన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ఎలుకల స్వైర విహారం


విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా అధికారులు

ఏడుగురు విద్యార్థినులను గాయపర్చిన వైనం

గోపాల్‌పేట: మండలంలోని బుద్దారం బాలికల గురుకుల పాఠశాలలో ఎలుకలు స్వైర విహారం చేస్తున్నాయి. గదుల్లో నిద్రిస్తున్న విద్యార్థులను కరిచిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. విద్యార్థినులు, పీహెచ్‌సీ వైద్యుడు తెలిపిన వివరాలిలా.. బుద్దారం బాలికల గురుకుల పాఠశాలలో రోజులానే ఆదివారం రాత్రి భోజనాల తర్వాత విద్యార్థులు వారి వారి గదుల్లో నిద్రించారు. అయితే, పదో తరగతి విద్యార్థినులు శశిరేఖ, భవాణి, జ్యోత్స్న, కీర్తన, స్నేహ, ప్రసన్న, సౌమ్య ఒకే గదిలో నిద్రించగా.. తెల్లారేసరికి కాళ్లు, చేతులను ఏదో కరిచినట్లు గుర్తించారు. ఆ చుట్టుపక్కల పరిశీలించగా ఎలుకలు కనిపించాయి. వెంటనే విషయాన్ని టీచర్ల దృష్టికి తీసుకెళ్లగా వారు మొదట పాఠశాలలో ఉన్న ఆర్‌డీఎస్‌కే క్యాంపునకు, అనంతరం గోపాల్‌పేట పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. వైద్యుడు డాక్టర్ చాంద్‌పాష విద్యార్థినుల గాయాలను పరిశీలించారు. ఆరుగురికి చిన్నగా, ఒకరికి మాత్రం సెంటీమీటర్ అంత ఎలుకలు కరిచినట్లు గుర్తించి టీటీ ఇంజక్షన్ ఇచ్చారు. ఇదే విషయమై గురుకుల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా తాను నెల రోజుల నుంచి సెలవులో ఉన్నానని, ఇన్‌చార్జ్ చూసుకుంటున్నారని, ఎలుకల నివారణ కోసం మందు తీసుకువచ్చామని, సెలవు రోజుల్లో చల్లాలని ఉంచినట్లు తెలిపారు.


విద్యార్థిని కాలికి అయిన గాయం

జిల్లా అధికారుల సందర్శన

విషయం తెలుసుకున్న డీఎంహెచ్‌ఓ శ్రీనివాసులు, డీఏఓ ఆంజనేయులుగౌడ్, తహసీల్దార్ పాండు నాయక్ సోమవారం రాత్రి గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు పీహెచ్‌సీలో వైద్యం చేయించుకొని రాగా.. ప్రస్తుతం ఆరోగ్యం ఎలా ఉందని ఆరా తీశారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు.

అలంపూర్ ఆలయాల్లో ముగిసిన టెండర్లు

సరైన పత్రాలు లేక 11 వాయిదా

అలంపూర్: సరైన పత్రాలతో దరఖాస్తు చేసిన టెండర్లను ఆమోదానికిగాను రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ కమిషనర్‌కు పంపినట్లు ఆలయ ఈఓ దీప్తి సోమవారం తెలిపారు. ఇందులో స్టేషనరీ సామగ్రి, విస్తర్లు, దొప్పలు, శానిటేషన్ హౌస్ కీపింగ్, కూరగాయలు, పాలు, పెరుగు, అవుట్ సోర్సింగ్, సెక్యూరిటీ సిబ్బంది సరఫరా టెండర్లు ఉండగా.. సరైన ధ్రువపత్రాలు జతపర్చి ధరలు కోడ్ చేసినట్లు వివరించారు. పూలు, లైటింగ్ డెకరేషన్, టెంట్ హౌస్ సామగ్రి, ప్రింటింగ్, ప్రింటెడ్ లడ్డు, పులిహోర కవర్లు, క్యారీబ్యాగులు, అరటి మట్టలు, మామిడాకులు, సీసీ కెమెరాల నిర్వహణ, ఫొటోలు, వీడియోలు తీయుట, స్వామి, అమ్మవారి ముద్రతో రాగి డాలర్లు, కంకణాల సరఫరా, హోమపు కట్టెలు (సమిధలు) సరఫరా టెండర్లు సరైన ధ్రువపత్రాలు జతపర్చకపోవడం, కోడ్ చేసిన ధరలు సరిగా లేకపోవడంతో వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. మరో టెండర్ ఇద్దరు మాత్రమే పాల్గొనడంతో 11 టెండర్లు వాయిదా వేసినట్లు తెలిపారు. వాయిదా వేసిన టెండర్లను తిరిగి నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటిస్తామన్నారు. కండువాలు, శాలువాలను తెలంగాణ హ్యాండ్‌లూమ్ ద్వారా కొనుగోలు చేయాలన్న ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రద్దు చేసినట్లు వివరించారు.

అస్పష్టంగా టెండర్ల నిర్వహణ

టెండర్ల నిర్వాహణ అస్పష్టంగా ఉందని హిందు ధార్మిక సేన రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ శర్మ ఆరోపించారు. అలంపూర్ క్షేత్రంలో వివిధ అంశాలకు సంబంధించిన టెండర్లను సోమవారం నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఏ ఆలయంలో లేని విధంగా నిబంధనలు ఉన్నట్లు పేర్కొన్నారు. టెండర్లలో జోగుళాంబ అమ్మవారి డాలర్ ఇవ్వాలని ఉందని కానీ ఎంత పరిమాణం, నాణ్యత ఎంత అనే అంశాలను అందులో పొందుపర్చలేదని పేర్కొన్నారు. అవసరం లేని సర్టిఫికేషన్ సైతం అడుగుతున్నట్లు తెలిపారు. ఒక టెండర్ తిరస్కరణకు గురైతే అందుకు గల కారణాలను సైతం వెల్లడించడం లేదని లేదని, ఈ విషయం గురించి అధికారులను అడిగితే అందుకు సంబంధించిన సమాధానం రావడం లేదని పేర్కొన్నారు. ఒక టెండర్‌కు కనీసం ముగ్గురు ఉండాలని నిబంధన ఉందని, అయితే ఒక టెండర్‌కు 5 మంది దరఖాస్తు చేసుకుంటే అందులో ఇద్దరివి తిరస్కరణకు గురైనట్లు పేర్కొన్నారు. నిబంధన మేరకు ముగ్గురు దరఖాస్తుదారులు ఉన్నప్పటికి టెండర్ నిర్వహణ జరగలేదని తెలిపారు. ఇలా ప్రతి టెండర్ నిబంధనలు అస్పష్టంగా ఉండటంతో టెండర్ల నిర్వహణ గందరగోళంగా మారినట్లు ఆరోపించారు. అధికారులు స్పష్టమైన నిబంధనలతో టెండర్లు ఆహ్వానించాలని సూచించారు.

వరిలో సస్యరక్షణ చర్యలు

- అధిక వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి

పాడి-పంట
జిల్లా వ్యవసాయాధికారి, జాన్ సుధాకర్


వరి పొలం

కోస్గి: ఈ ఏడాది జిల్లాలో పలు ప్రాంతాల్లో వరి పంట అధిక మొత్తంలో సాగు చేశారు. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట పొలాల్లో నీరు నిల్వ ఉండటంతో చీడపీడలు, పురుగుల ఉధృతి పెరిగే ప్రమాదం ఉండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తెగుళ్ల, వివిధ రకాల పురుగులు ఆశించకుండా చేపట్టాల్సిన జాగ్రత్తలపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్ పలు సూచనలు వివరించారు.

తెగుళ్ల యాజమాన్యం

అగ్గి తెగులు: ఆకులపై నూలు కండె ఆకారంలో గోధుమరంగు మచ్చలు ఏర్పడి చివరి ఆకుల వరకు పూర్తిగా ఎండినట్లు కనిపిస్తాయి. పైరు పూతదశలో ఉన్నప్పుడు వెన్ను, మెడ భాగంలో తెగులు ఆశిస్తే వరికొమ్మ మెడ ఇరిగి తాలు గింజలు ఏర్పడతాయి.

నివారణ: కేజీ విత్తనానికి 4 గ్రాముల కార్బెండిజ్ కలిపి విత్తనశుద్ధి చేయాలి. ట్రై సైక్లోజోల్ 75 శాతం మందును 6 గ్రాములు లేదా ఎడిఫెన్‌ఫాస్ 1 మి.లీ. లీటర్ నీటిలో కలిపి పంటపై పిచికారి చేయాలి.

కాండం కుళ్లు తెగులు: కాండ ఏర్పడే దశ నుంచి పంట పాలు పోసుకునే వరకు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది.

నివారణ: తెగులు సోకిన పొలంలో పరిశుభ్రత పాటించాలి. విత్తనశుద్ధి చేయాలి. తెగులు లక్షణాలను గుర్తిస్తే వాలిడామైసిన్ 2 మి.లీ. లేదా హెక్సాకోనోజల్ 2 మి.లీ. మోతాదులో లీటరు నీటికి కలిపి 15 రోజుకోసారి రెండుసార్లు పిచికారీ చేయాలి.

ఎండాకు తెగులు: తెగులు సోకిన పంటలో ఆకు అంచుల వెంబడి పసుపు రంగు మచ్చలు ప్రారంభమై చివరకు ఆకులు పూర్తిగా ఎండిపోతాయి.

నివారణ: ప్రొపికోనోజల్ 1 మి.లీ. లేదా హెక్సాకోనోజల్ 2 మి.లీ. లేదా వాలిడామైసిన్ 2 మి.లీ. మోతాదులో ఏదేని మందును లీటరు నీటిలో కలిపి పొలంలో నీరు మొత్తం తీసివేసి మొదళ్ల వద్ద తడిచేటట్లు పిచికారీ చేయాలి.

పొడ తెగులు, మానిపండు తెగులు: పంట పుష్పించే దశలో ఆశిస్తుంది. అండాశయం ఆకుపచ్చ రంగు ముద్దగా మారిన తర్వాత గింజలన్ని పసుపు రంగు ఉండల్లాగా మారి దిగుబడి తగ్గుతుంది.

నివారణ: హెక్సాకోనోజల్ 2 మి.లీ. లేదా ప్రొపికోనోజల్ 1 మి.లీ. లేదా వాలిడామైసిన్ 2 మి.లీ. మోతాదులో లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. అలాగే మోనోక్రోటోఫాస్ 2 మి.లీ. మోతాదులో లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పురుగులు.. నివారణ చర్యలు

కాండం తొలిచే పురుగు: ఈ పురుగు సోకితే పిలకలు చనిపోతాయి. వెన్నులు తెల్ల కంకులుగా మారుతాయి. 5 శాతం పువ్వులు చనిపోయినట్లు గుర్తించిన వెంటనే సస్యరక్షణ చేపట్టాలి.

నివారణ క్లోరోఫైరిపాస్ 2.5 మి.లీ. లేదా మోనో క్రోటోపాస్ 1.6 మి.లీ. లేదా ఎసిఫెట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఉల్లికోడు: ఈ పురుగు సోకకముందే వరి పంట నాటిన 10 నుంచి 15 రోజుల వ్యవధిలో ఎకరాకు 10 కేజీల కార్బోఫ్యూరాన్ లేదా 6 కేజీల ఫోరేట్ గుళికల మందు వేయాలి.

సుడిదోమ/దోమపోటు: వరిలో దోమపోటు నివారణకు నారు నాటే సమయంలో ప్రతి 2 మీటర్లకు 20 సెం.మీ. బాటలు వదిలి నాటు వేసుకోవాలి. దోమపోటు, సుడిదోమ గుర్తించిన వెంటనే ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రైడ్ 2.2 మి.లీ. మోతాదులో లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఉపాధ్యాయ వృత్తికి ప్రత్యేక స్థానం


మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న వీసీ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ప్రత్యేక స్థానం ఉందని పీయూ వీసీ శ్రీనివాస్ అన్నారు. ఇటీవల రాష్ట్రస్థాయి అధ్యాపక అవార్డును పొందిన పీయూ ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డికి సోమవారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. సమాజంలో అన్ని వృత్తుల వారిని తయారు చేసే ఏకైక వృత్తి ఉపాధ్యాయ వృత్తన్నారు. అనంతరం మధుసూదన్‌రెడ్డిని శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ప్రిన్సిపాళ్లు కరుణాకర్‌రెడ్డి, రవికాంత్, పీడీ శ్రీనివాస్, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 25 గొర్రె పిల్లలు మృతి



ఊట్కూరు: మండలంలోని సమస్తాపూర్ గ్రామ శివారులో వీధి కుక్కల దాడిలో 25 గొర్రె పిల్లలు మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. కొల్లూరు గ్రామానికి చెందిన కుర్వ పెద్ద బీరప్ప సమస్తాపూర్ శివారులో 25 గొర్రె పిల్లలను ఇనుప కంచెలో ఉంచి పెద్ద గొర్రెలను మేపేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ఇనుప కంచెలోకి వెళ్లిన కుక్కలు గొర్రె పిల్లలపై దాడి చేశాయి. దాడిలో 25 గొర్రె పిల్లలు మృతి చెందాయి. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లిందని ప్రభుత్వం తరపున ఆదుకోవాలని బాధితుడు కోరారు.